


# రక్షణ

### రావినూతల సువర్ణ కన్నన్



"**ఇదిగో** ధనం! మీ మినిస్టర్ మావయ్య కొడుకు అరుణ్ పెళ్ళి! శుభలేఖ వచ్చింది!" అంటూ వచ్చారు శ్రీవారు. చేసే పని వదిలి ఒక్క అంగలో ఆయన దగ్గరి కెళ్ళి—"నిజమే?" అన్నాను ఉత్సాహంగా.

ఆయన శుభలేఖ నా చేతికిచ్చి, కాళ్ళూ చేతులూ కడుక్కోవడానికి పెరట్లో కెళ్ళిపోయారు. నేను ఆత్రుతగా శుభలేఖ చూశాను.

పెళ్ళి ఎల్లుండే! ఉదయం అయిదు గంటలకి. ఖమ్మంలో.

నాకు కాళ్ళూ, చేతులూ ఆడలేదు. మే ముంటున్నది భద్రాచలం దగ్గర ఓ అడివిలాంటి ప్రదేశంలో. అక్కణ్ణించి ఎక్కడికి వెళ్ళాలన్నా భద్రాచలం వచ్చి బస్సులు ఎక్కవల "సిందే. మాపుట్టిల్లు విజయవాడ దగ్గర ఓ పల్లెటూరు. ఇక్కణ్ణుంచి మా ఊరు వెళ్ళాలంటే...నానా అవస్థా పడాలి.

"ఢిల్లీ, బొంబాయి లన్నా తేలిగ్గా వెళ్ళొచ్చుగానీ, మీ ఊరెళ్ళడం యాతన, బాబూ!" అంటుంటారు శ్రీవారు- ఉద్యోగం చేసేది తనే అన్న సంగతి అప్పుడప్పుడు మరిచిపోయి.

"ఏమిటీ. ఇంకా ఆ శుభలేఖనే చూస్తూ కూర్చున్నావ్?... అంత బావుందా అది?" అంటూ వచ్చారు శ్రీవారు.

"ఎల్లుండేనండీ పెళ్ళి?" దిగులుగా అన్నాను.

"అవును...రే పెళ్ళు!" ముఖం తుడుచుకుంటూ అన్నారు శ్రీవారు.

"వెళ్ళు అంటున్నారు మీరు రారా?"

"సారీ ధనం! నాకు వీలవదు!" అన్నా రాయన మెల్లగా.

నాకు తెలుసు ఆయనలా ఎందుకన్నారో... మా మినిస్టర్ మావయ్యకీ, వాళ్ళ పిల్లలకీ చాలా గర్వం అంటుంటా రాయన ఎప్పుడూ. నేను మాత్రం చస్తే ఆ మాట ఒప్పుకోను. నిజానికి అరుణ్‌కు నేను భార్యను కావల "సింది. అసలు చిన్నతనం నించీ మా అమ్మమ్మ—'ఇది...అరుణ్‌గాడి పెళ్ళామే.' అంటూ ముద్దులాడేది నన్ను. అయితే, మా అత్తయ్య మాత్రం ముఖం అదోలా తిప్పుకునేది.

తరువాత నాన్న మామయ్యని అడగడం, ఆయనగారు నసుగుతూ కొడుకుమీద తోసెయ్యడం, ఆ తరువాత అత్తా, అమ్మమ్మా, అమ్మా ఘర్షణ పడడం జరిగింది. అత్త ఉద్దేశంలో అరుణ్‌కి నేను తగిన దాన్ని కాను. అమ్మమ్మ "అందం కొరుక్కు తింటామా" అని అరిచినా ఫలితం లేకపోయింది.

నాన్నకి వాళ్ళమీద కోపం వచ్చి...క్షణాలమీద నాకు సంబంధం కుదిర్చి, రంగ రంగ వైభోగంగా పెళ్ళి జరిపించేశాడు. కొన్నాళ్ళ పాటు ఆ ఇంటి మీద కాకి ఈ ఇంటిమీద వాలలేదు. చివరికి మావారికే ఉద్యోగంలో మినిస్టర్ మామయ్యతో ఏదో పని బడి మావగార్నడగడం, ఆయన అల్లుడి మాట తీసెయ్యలేక మినిస్టర్ మామయ్య దగ్గరి కెళ్ళడంతో మళ్ళీ త్వరలోనే రెండు కుటుంబాలూ దగ్గరయ్యాయి. అయినా, మా వారికి వాళ్ళంటే సదభిప్రాయం లేదు.

"ఏమిటి...ఎంత సేపూ ఆ శుభలేఖని చూసి మురవడమేనా, కాఫీలాంటి దేమైనా నా మొహాన పోసేదేమైనా ఉందా?" కాస్త సరదాగాను, కాస్త వ్యంగ్యంగానూ అన్నా రాయన.

"కాఫీకేం గానీ...మీరూ బయల్దేరండి! ఇద్దరం వెళ్ళొద్దాం...!" అంటూ వంటింట్లోకి దారితీశాను. ఆయనేం మాట్లాడలేదు. ఆ తరువాత ఆయన్ని బతిమాలి, బతిమాలి రేపు రాత్రి కెళ్ళి ఎల్లుండి పెళ్ళి చూసుకుని, ఆ మర్నాటికల్లా తిరుగు బస్సులో వచ్చేలా ఒప్పించాను. ఆ రాత్రి పడుకున్నా నన్న మాటే గానీ, నా కంటికిమీదికి కునుకే రాలేదు.

పెళ్ళి కూతురు ఎలా ఉంటుంది?... అత్త, అరుణ్ కోరుకున్నట్టు అందాల రాశేనా? బుద్ధిమంతురాలేనా? నాన్న ఇచ్చినంత కట్నకానుక లిస్తున్నాడా అరుణ్ మావగారు? ఇలా సాగుతున్నాయి ఆలోచనలు. మనసులో మాత్రం అరుణ్‌కి కాబోయే భార్య పేదింటిదైతే బావుండు. రాక్షసైతే అత్తే మౌతుంది?... అమ్మమ్మ మా ధనాన్ని చేసుకుంటే...అన్ని విధాలా సుఖపడేదానివి! అని అత్తన్నదెప్పితే?...తనకి తృప్తిగా ఉంటుంది అనుకున్నాను.

అందుకే నా స్థితిగతులు, సిరిసంపదలు కనిపించేలా ప్రవర్తించాలి...తన బట్టలూ, నగలు చూసి...అంత మినిస్టరు భార్యా కుళ్ళుకోవాలి. ఎలాగో కలతనిద్రతోనే తెల్లవారింది.

నా హడావిడీ అదీ చూసి నవ్వారు మావారు. నా పెట్టెలోని పట్టుచీరలు చూసి, "ఇవన్నీ ఒక్కరోజు పెళ్ళికే?" అంటూ ఆశ్చర్యం నటించారు. నే నదేం పట్టించుకోలేదు.

మేం భద్రాచలం బస్టాండుకు వెళ్ళాలంటే మూడు మైళ్ళు నడవాలి. లేకపోతే బండిలాంటి దేన్నైనా మాట్లాడుకోవాలి. అందుకే మధ్యాహ్నంనించీ హడావిడి పడిపోయాను.

నాకు చిన్నతనంనించీ నగలంటే చాలా ఇష్టం. కలవారి పిల్లని, ఒకే ఒక్క సంతానాన్ని కాబట్టి ఒంటెడు నగలు చేయించాడు మానాన్న. ఎక్కడి కెళ్ళినా ఆ నగలన్నీ పెట్టుకుని, పెద్ద జరీ అంచున్న కంచిపట్టు చీర కట్టుకుని లక్ష్మీదేవిలా వెళ్ళటం నా కిష్టం. ఇది మావారి కంతగా నచ్చకపోయినా నగలు పెట్టెల్లో దాచేకన్నా, ఒంటికుంటేనే సేఫ్టీ అనుకుని పెద్దగా వారించేవారు కాదు.

అలాగే ఆరోజు కాసులపేరూ, చంద్రహారం, పదిహేను జతల గాజులు, మధ్య మధ్య రాళ్ళ గాజులు వేసుకున్నాను. మువ్వల వడ్డాణం పెట్టుకున్నాను. చెంప స్వరాలు కనిపించేలా జుట్టు సవరించుకున్నాను. ఎర్రరాళ్ళ అడ్డిగని కంచిపట్టు చీర జరీ మాసెయ్యకుండా జాగ్రత్త పడ్డాను. చేతి అరవంకీలు మిలమిల లాడుతుంటే తృప్తిగా మరోసారి అద్దలో చూసుకుని—"నేను రెడీ" అన్నాను శ్రీవారితో. క్షణం నాకేసి అదోలా చూసి తల తిప్పుకున్నా రాయన.

అసలు ఆయనకు ఆ నగలు ఊరికి తేవడమే ఇష్టం లేదు. అసలే అడివి ప్రాంతం. బందిపోటు దొంగలు సైతం తిరుగుతూంటారు అంటూ అనేక విధాల వారించారు కూడా. అయితే ఇలాంటి పెళ్ళిళ్ళేదైనా జరిగితే మా సివాయినం ముత్తయిదువులులా ఎలా వెళ్ళడం? అందుకే నేను పోట్లాడి మరీ తీసుకొచ్చాను.

మేం భద్రాచలం చేరుకునేసరికి సాయంకాలం అయిపోయింది. పెళ్ళిళ్ళ సీజనేమో బస్సులు కిక్కిరిసి పోయున్నాయి. ఎలాగయితేనేం చివరికి ఆరు దాటుతూండగా ఓ బస్సులో సీట్లు సంపాదించి తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాం. నేను కొంగు భుజాల నిండుగా కప్పుకున్నాను అందరూ నా నగల్ని ఆశగా చూస్తుంటే. అది ప్రైవేట్ బస్సేమో జనాన్ని కుక్కేశాడు బస్సునిండా. బస్సు బరువుగా బయల్దేరి ఆగుతూ, కదుల్తూ వెళ్ళి ఓ నిర్జన ప్రదేశంలో ఆగి ఠప్! ఇంక నేను కదలను అంటూ మొరాయించింది. అందరూ బిలబిల్లాడుతూ దిగారు. డ్రైవరు, కండక్టరు, క్లీనరు...మెల్లిగా దిగి కబుర్లాడుకుంటూ బస్సును బాగుచెయ్యాలని ప్రయత్నిస్తున్నారు.

గంట! రెండు గంటలు! మూడు గంటలు కూడా దాటిపోయాయి. కానీ బస్సుమాత్రం బాగయ్యే సూచనలు కనిపించలేదు. కొందరు ప్రయాణీకులు ఒకటి రెండు బస్సుల్లోనూ, లారీల్లోనూ వెళ్ళిపోయారు. మరో గంట తరువాత మరి కొందరు ఏదో ఓ వాహనం చూసుకొని వెళ్ళిపోయారు. బస్సువాళ్ళు కాక ఒకరిద్దరు ప్రయాణికులు, మేమూ మాత్రం మిగిలిపోయాం. ఇక ఈ రాత్రికి బస్సు కదలదు." చావు కబురు చల్లగా చెప్పాడు డ్రైవర్.

గుండె ఆగినంత పనయింది నాకు. ఓ సారి చుట్టూ చూశాను. చిక్కని అడివి...అమావాస్య చీకటి...కీచురాళ్ళ ధ్వనులు. అంతవరకూ అణిచిపెట్టుకున్న భయం కొండలా పెరిగిపోయింది. ఓ సారి నా నగలకేసి చూసుకున్నాను. చిరు చీకట్లో కూడా అవి మెరిసిపోతున్నాయి. ఆ ప్రాంతం ఏదో తెలిశాక గుండెలు మరింత వేగంగా కొట్టుకున్నాయి. అక్కడెన్ని దోపిడీలు జరిగాయో, ఎన్ని హత్యలు జరిగాయో గుర్తొచ్చాయి.

దూరంగా ఏదో లైటు! మేము ఆలోచించేలోగానే మిగతావాళ్ళు ఆ వాహనాన్ని ఆపేసి అందులో ఎక్కేశారు. మేము వెళ్ళి అడిగేసరికే లాభంలేకపోయింది. కారు దూరం అయిపోయింది.

"మీరు లోపల పడుకోండయ్యా! ఇక ఏ బస్సులూ రావు!..." సలహా ఇచ్చాడు కండక్టర్ నా నగలకేసి అదోలాచూస్తూ. వాడి చూపు నాకు మరింత వణుకు పుట్టించింది. దాన్ని కనిపించనీకుండా వెనక సీట్లో కెళ్ళాను.

నా మొహం! నిద్రపడుతుందా? ఏ దొంగ వెధవో నెత్తి వగులగొట్టి నగలు కాస్తా పట్టుకు చక్కాపోతాడు. అయినా నా పిచ్చిగానీ వేరే దొంగలు రావాలా...ఈ వెధవలు ముగ్గురూ చాలరూ? మావారు కూడా వచ్చి నా పక్కగా కూర్చున్నారు, నాకేసి వోరగా చూస్తూ. ఆ చూపెందుకో నాకు తెలును. నేను అన్ని నగలు పెట్టుకున్నానని. అయినా ఇలా జరుగుతుందని కలగన్నానా? ఇలా జరుగుతుందని ముందే తెలిస్తే ఏ కత్తో తెచ్చుకునేదాన్ని వాళ్ళని బెదిరించటానికి.

అర్ధరాత్రి అయిపోయింది. పెళ్ళిమాట దేవుడెరుగు కొంపకి క్షేమంగా చేరితే చాలు అని వెయ్యి దేవుళ్ళకి మొక్కుకుంటూ బిక్కుబిక్కుమంటూ కూర్చున్నాం. డ్రైవర్ సిగరెట్ కాలుస్తూ ఓసారి వెనక్కి తిరిగి అదోలా చూశాడు నాకేసి. వాడలా చూస్తుంటే చెప్పొద్దూ నాకు వెన్నులోంచి చలిలాంటిది బయలుదేరింది.

"చూశారా ఆ డ్రైవర్ వెధవెలా చూస్తున్నాడో?" రహస్యంగా అన్నాను శ్రీవారితో.

"ఛ! నోరు మూసుక్కూర్చో!" కసిరా రాయన. ఆడదాన్ని ఏం చేస్తాను?...కిమ్మనకుండా కూర్చున్నాను.


అప్పుడే దూరంనుంచి ఏదో వాహనం వస్తున్నట్టు వెలుగు కనిపించి మా ప్రాణాలు లేచొచ్చాయి. గభాల్న లేచి దిగబోయారు శ్రీవారు.

"ఎక్కడికి సార్?" కంగారుగా అన్నాడు కండక్టరు.

"దాన్లో వెళ్ళిపోతాం! ఉదయం పెళ్ళికి అందుకోవాలి" అన్నారు శ్రీవారు.

"ఒద్దు సార్!...అది లారీ! అర్ధరాత్రి ఆడవాళ్ళతో ఒంటరిగా లారీలో ప్రయాణం చెయ్యడం అంత మంచిదికాదు..." నా నగలకేసి చూస్తూ అన్నాడు కండక్టరు.

వాడి ప్లాన్ నా కర్థమయింది. ముగ్గురూ కలిసి నా నగలు కాజెయ్యాలని వాడి ఆశ. మేం ఎక్కడ వెళ్ళిపోతామో అని తెగ కంగారుపడిపోతున్నాడు.



అందుకే వచ్చిన ఈ అవకాశాన్ని జారవిడుచుకో కూడదు అనుకుని "ఫరవాలేదు! ఆపండి" అన్నాను శ్రీవారితో. ఆయనక్కూడా అదే మంచి దనిపించింది కాబోలు లారీ ఆపడానికి బస్సు దిగారు. ఆ లారీని చూసిన డ్రైవర్ "అమ్మా! నా మాట వినండి. వాడి సంగతి మీకు తెలియదు. వట్టి దగుల్బాజీ వెధవ!...వాడి బొడ్లో కత్తి ఉంటుందికూడా" అంటూ గునగునగా ఏదో చెప్పబోయాడు. అయినా నే నవేం వినిపించుకోకుండా పెట్టెతో సహా దిగేశాను.

"ఇంక మిమ్మల్ని ఆ దేవుడే కాపాడాలి!" గొణిగినట్టు అన్నాడు క్లీనర్. నాకు ఒళ్ళు మండిపోయింది. ఓ సారి వాళ్ళందరికేసి తీక్షణంగా చూసి రోడ్డుమీదికొచ్చాను.

"త్వరగా ఎక్కండి" కర్కశంగా అన్నాడు లారీ డ్రైవర్. వాడి గొంతు బొంగురుగా ఉంది. ఆకారం చూస్తే భయంకరంగా ఉంది. క్షణం ఆలోచించిన శ్రీవారు లారీ ఎక్కేశారు. ఆపై నేనూ ఎక్కాను. నేను ఎక్కుతుంటే లారీ డ్రైవరు నాకేసి అదోలా చూశాడు. ఆ చూపుకి నాశరీరంలోనిరక్త మంతా నీరుగా మారిపోయినట్లయింది. భయంతో పెదవులు వణికాయి. అయినా అలాగే ముడుచుకుని కూర్చున్నాను.

లారీ చప్పుడు చేస్తూ కదిలింది. చుట్టూ భయంకరమైన నిశ్శబ్దం. చిక్కని చీకటి! తెలుగు సినిమాలోని విలన్‌లా ఉన్న డ్రైవర్! వాడి దగ్గర్నుంచి ముక్కులు బద్దలయ్యేలా నాటు సారా వాసన!

"ఈ లారీ ఎక్కి పొరపాటు చేశాము..." అనిపించిందో క్షణం. వెంటనే బస్సు డ్రైవరు వాళ్ళూ వాళ్ళ చూపులు గుర్తొచ్చాయి.

"వాళ్ళు ముగ్గురు! వీడు ఒక్కడేగా! అవసరం అయితే ఇద్దరం కలిసి వీడి సంగతి తేల్చొచ్చు" అని నాకు నేనే ధైర్యం చెప్పుకున్నాను. మాబారు ఏం ఆలోచిస్తున్నారోగానీ మౌనంగామాత్రం కూర్చున్నారు. ఓ అరగంట ప్రయాణించి లారీ ఆగిపోయింది.తుళ్ళిపడ్డాం ఇద్దరం.

"ఓసారి దిగండి!" అన్నాడు డ్రైవరు. భయంగా చూసి దిగాం.

"ఏమైంది?" అన్నారు శ్రీవారు. వాడు మాట్లాడకుండా బోనెట్ ఎత్తి ఏవో వైర్లు సరిచేస్తున్నాడు. మేం బిక్కుబిక్కుమంటూ ఓ పక్కగా నిల్చున్నాం. కాళరాత్రంటే ఇలాగే ఉంటుందేమో! అనిపించింది నాకు. డ్రైవర్ ఇవతలగా వచ్చి "ఓ సిగరెట్టుందా గురూ!" అన్నాడు చనువుగా. మాబారు ముఖం చిట్లించి జేబులోంచి సిగరెట్ తీసి ఇచ్చారు. ఆయనకి ఎవరైనా 'గురూ' అని పిలిస్తే చాలా కోపం! అదీగాక వాడి మాటల్లో మర్యాదకూడా లేదు. అయినా మా చిరాకుని మాలోనే దాచుకుని జరిగేది చూస్తూ నిల్చున్నాం.

డ్రైవర్ సిగరెట్టు ముట్టించి షర్ట్ విప్పి సీట్ దగ్గర పడేసి కిరసనాయిలు దీపం వెలిగించి లారీ కింద దూరి ఏదో చూడ్డం మొదలుపెట్టాడు. రెండు నిమిషాల తర్వాత బైటికొచ్చి-

"క్లీనర్ నాకొడుకు రాలేదు!" అంటూ కాస్సేపు రాని క్లీనర్ని బూతులు తిడుతూ ఎక్కడి వక్కడ సర్దేసి "ఎక్కండి" అన్నాడు.

మేం మౌనంగా ఎక్కి కూర్చున్నాం.

మరోసారి అగ్గి పుల్ల వెలిగించాడతను. ఆ వెలుగులో అతని బొడ్లో ఉన్న కత్తి కనిపించి మరీ వణికిపోయాం. అచ్చం సినిమాలోని విలన్‌లా దాచుకున్నాడు.

"ఇలాంటి వెధవల్ని బైటిలా తిరగనిస్తారండీ. ఈ పోలీసాళ్ళు?" గునగునగా అన్నాను మావారి చెవిలో. "ష్!" అన్నట్టు కళ్ళురిమి చేశారాయన.

నేను నోరుమూసుకున్నాను. మాఆలోచనలతో తనకేం సంబంధంలేనట్టు లారీ స్టార్ట్ చేశాడు డ్రైవర్.

అరచేతుల్లో ప్రాణాలు పెట్టుకుని కూర్చున్నాం. అలా ఓ గంట ప్రయాణించాక ఓ చిన్న పల్లె వచ్చింది. ఊరంతా నిశ్శబ్దంగా ఉంది. రోడ్డు పక్కగా ఉన్న ఓ పాకలోని లైట్‌మాత్రం గుడ్డిగా వెలుగుతోంది. లారీ ఆపాడతను. శ్రీవారు చిరాగ్గా చూశారు. డ్రైవర్ లారీ దిగి "గురూ! కొన్ని టీనీళ్ళు తాగుదాం రా!" అన్నాడు ఆప్యాయత ఒలకబోస్తూ.

"నాకొద్దు!" గంభీరంగా అన్నారాయన.

"అదేటి గురూ!...నేను తాగమన్నది టీ నీళ్లే! నాటుసారా గాదు...పద..."మొహమాట పెట్టాడతను. తప్పనిసరిగా దిగారాయన.

"నువ్‌గూడా రా!" నాకేసి చూస్తూ అన్నాడు డ్రైవర్. నేను కొయ్యబారిపోయాను. ఆయన్ని ఏకవచన ప్రయోగం చేస్తేనే చిరాగ్గా ఉంది. వీడిప్పుడు నన్ను కూడా...కానీ ఏం అనలేక ఒద్దు అన్నట్లుగా కంగారుగా తలూపాను. నా కంగారుకి వాడు చిన్నగా నవ్వి పాక కేసి నడిచాడు. అంతటితో ఆగక ఓ గ్లాసు టీ తెచ్చి "తాగు" అన్నాడు నాకేసి అదోలా చూస్తూ. ఏమంటే ఏమౌతుందో అన్నట్టు వణుకుతూ గ్లాసు అందుకున్నాను.

"మందేవూరు?" ఓరగా చూసి ఇకిలిస్తూ అడిగాడు. నాలో వణుకు పెరిగిపోయింది.

"నిన్నే!...మందేవూరు? ఓ పాలి మా ఊరొత్తావేటి?" కొంటెగా అన్నాడతను.

నేను కోపంగా ఏదో అనబోయాను. ఇంతలో అతన్నెవరో పిలవటంతో వెళ్ళిపోయాడు. మరో అయిదు నిముషాలకల్లా మాబారొచ్చారు. పాక కుర్రాడు కాబోలు గ్లాసు తీసికెళ్ళిపోయాడు.

డ్రైవర్, శ్రీవారూ కూడా లారీ ఎక్కారు.


"ఇవాళ నా పని గోవిందా! ఈ తాగుబోతు వెధవ కళ్ళు నా మీద పడ్డాయి" అనుకుంటే నాకు దుఃఖం ఆగడంలేదు. ఊపిరి బిగబట్టుక్కూర్చున్న నాకేసి ఓరగా చూస్తూ లారీ స్టార్టు చేశాడతను. బండబూతులు మాట్లాడుతూ వెకిలిగా నవ్వుతూ మధ్య మధ్య నన్ను అదోలా చూస్తూ తనని తాను మరిచి డ్రైవ్ చేస్తున్నాడతను.

క్షణక్షణానికీ మాలో భయం పెరిగిపోతోంది. నన్ను అదోలా చూడ్డం, ముసిముసిగా నవ్వడం మాబారు గమనిస్తున్నారు. కానీ నిస్సహాయ స్థితి. సినిమాల్లోనూ, పుస్తకాల్లోనూ తప్ప ఇలాంటి విలన్స్‌ని చూడలే దెప్పుడూ అందుకే ప్రాణాల్ని అరచేతుల్లో పెట్టుకుని క్షణాలు లెక్కపెడుతూ కూర్చున్నాం. ఏవేవో కబుర్లు చెప్తూ, పక్కన ఆడవాళ్ళున్నారన్న జ్ఞానమైనా లేకుండా అసభ్యకరమైన పదజాలంతో ఉత్సాహంగా మాట్లాడుతున్నాడతను. కారణం ఉన్నా లేకపోయినా పగలబడి నవ్వుతున్నాడు.

"వీడింతకు ముందు తాగింది టీ నీళ్ళు కాదు, నాటు సారా" కసిగా అనుకొని ఆవేశాన్ని బలవంతంగా అణుచుకుని 'మమ్మల్ని సవ్యంగా ఇల్లు చేర్చు భగవంతుడా!' అని కనిపించని ఆ దైవానికి మొరపెట్టుకున్నాను. నా మొర ఆ దేవుడు ఆలకించాడు.. ఎలాగైతేనేం తెలతెలవారుతూండగా గమ్యం చేర్చాడు డ్రైవర్. పోతాయనుకున్న మా ప్రాణాలు కుదుటపడ్డాయి. ఖమ్మం హాస్పిటల్ దగ్గర ఓ పక్కగా ఆగింది లారీ. ఆగీ ఆగ్గానే గభాలున దూకేశాను. శ్రీవారు, డ్రైవరూ కూడా దిగారు. డ్రైవర్ సీట్ దగ్గరున్న షర్ట్ ఓ సారి దులిపి తొడుక్కున్నాడు. అప్పుడు ఇద్దరం అతనికేసి చూశాం.

అప్పు డతను భయంకరంగా కనిపించలేదు. పైగా ఎంతో మంచివాడిలా అనిపించాడు.

"రూపం ఎలా ఉంటేనేం మనసుమాత్రం గొప్పది!" నిజంగా ఇంత అమావాస్య రాత్రి ఒంటెడు నగలతో ఒక ఆడది తన లారీ ఎక్కితే తాగి



ఉండి, బొడ్లో కత్తి ఉండి, నవ్యంగా గమ్యం చేర్చాడంటే ఇతనే దేవుడు అని కూడా అనిపించింది నా మటుకు నాకు. అదే మా వారితో మెల్లగా అన్నాను. ఆయన కూడా అదే అభిప్రాయంలో ఉన్నట్టున్నారు. జేబులోంచి అదనంగా మరో పది నోటు అతని కందించబోయారు.

"ఇదెందుగ్గురూ?" నోటుకేసి ఆశగా చూస్తూ అన్నాడు డ్రైవరు.

"నీ మంచితనానికి." అతని మాటల కీసారి కోపగించుకోకుండా చిన్నగా నవ్వుతూ అన్నారు శ్రీవారు.

"మంచితనానికా?" తెల్లబోయా డతను.

"అవును. నీ స్థానంలో మరొక రుంటే కచ్చితంగా మమ్మల్ని దోచే సేవాడు." మన స్ఫూర్తిగా అన్నారు మా వారు. నోటు అందుకుని జేబులో దాచుకుంటూ "ఏటి గురూ! నీ మాట్లేం నా కర్థం గాట్లేదు." అయోమయంగా అన్నా డతను. అతని అమాయకత్వానికి నాక్కూడా నవ్వొచ్చింది.

"ఏంలేదయ్యా! అర్ధరాత్రి ఒంటెడు నగలతో ఓ ఆడపిల్ల నీ లారీ ఎక్కితే..." ఏదో చెప్పబోయారు శ్రీవారు.

"జరగనాట్ని గురించి కల్లు కండం ఎందుగ్గురూ?" నిస్పృహగా అన్నా డతను.

మే మిద్దరం మొహాలు చూసుకున్నాం.

"అది కాదయ్యా...మా ఆవిడ..."

"మీ ఆవిడా...?"

"ఇదిగో...ఈవిడ మా ఆవిడే! నీ నుంచి..." నా మాట పూర్తి కాకుండానే పగలబడి నవ్వాడతను.

"ఎందుకు నవ్వుతావ్?" బిత్తరపోయారు శ్రీవారు. నాకూ విషయం అర్థంకాలేదు.

"ఇదిగో గురూ! ఏవుర్నయినా మోసం సెయెగలవేమోగానీ ఈ జోగుల్ని మోసం సెయ్డం నీ తరం కాదుగదా...నీ దేవుడి తరం కూడా కాదు." మళ్ళీ నవ్వా డతను.

"ఇందులో మోసం ఏం ఉంది...నా భార్య."

"నీ భార్యా...ఎవురు?"

"ఛ! మళ్ళీ అదే మాట! ఈవిడే నా భార్య. ఇద్దరం కలిసి పెళ్ళికెళ్తూ..."

"ఇదిగో గురూ!...ఎందుకొచ్చిన మాటయ్యా!...అనలోటి తెల్సా?...నాకు అన్నిరకాల ఆడోల్లతో పరిశయా లుండాయ్యి. ఆడోల్లేటో, ఆళ్ళ యవ్వారం ఏటో నాకు తెలిసినంతగా ఈ ప్రాంతాల్లో ఎవురికీ తెలవదు...అలాటిది నాకాడే నీ డ్రామా ఆడేత్తే నమ్ముతా నేటి?

"అయినా ఓ బక్క సిక్కిన మొగోడికి ఆడేసం కట్టి, ఒంటినిండా గిల్టు నగలెట్టి అర్ధరేత్రి నా లారీ ఎక్కించేత్తే...అదుష్టం పండిందని ఎంటడే ఎర్రెదవ ననుకున్నావా నన్ను?" దర్పంగా అన్నా డతను.

మా ఇద్దరి ముఖాలూ మాడిపోయాయి.

"సరేగానీ గురూ! ఎలాంటేశానికైనా ఎగిరి గంతేసొచ్చే లడ్డూల్లాంటి గుంటలు ఎక్కడడితే అక్కడ దొరుకుతుంటే...పొగనూరు కట్టెలా ఉన్న ఈ గురుణ్ణెక్కడట్టా?...పోన్లే! ఈ పాలి కిలా కానిచ్చెయ్! ఈ సారి డ్రామా ఏ స్తేమాత్రం మాపాలెం వచ్చి నన్ను కల్సుకో...బంగారంనాంటి పిల్లల్ని సూపిత్తాను" అంటూ నమాధానంకోసం కూడా చూడకుండా లారీ స్టార్టు చేసుకుని వెళ్ళిపోయాడు డ్రైవర్.

ఇద్దరం కొయ్యబారిపోయాం.

అనలే నల్లగా కట్టెలా ఉన్న నా శరీరం మరింత నల్లగా అయిపోయింది. పీక్కుపోయిన ముఖం మరింత పీక్కుపోయింది. ఓసారి నన్ను నేనే చూసుకున్నాను.

నిజమే! నాలో ఆడ కళన్న మాట కాదుకదా శరీరంలో ఎక్కడా ఎముకలు, చర్మం తప్ప పిడికెడు కండన్న మాటే లేదు. కాంతి లేనట్టున్న నా నల్లని శరీరం మీది నగలు కాంతులు కోల్పోయి నిజంగా వాడు చెప్పినట్టు గిల్టు నగల్లాగే వెలవెలబోతున్నాయి.

విషయమంతా పూర్తిగా అర్థమయింది.

అంటే ఆ వెధవ...ఆ దరిద్రుడు నన్ను చూసి మగాడనుకున్నాడు. నా నగల్ని గిల్టు నగలనుకున్నాడు. అందుకే నా జోలికిగానీ, నా నగల జోలికిగానీ రాలేదు!...నిజంగా వాడు విలనే! నా రూపమే నన్ను రక్షించిందా?...వా డలా అనుకున్నందుకు బాధపడాలో, అలా అనుకున్నందువల్లే నా నగలు నాకు దక్కాయని ఆనందించాలో అర్థంకాని నేను చేష్ట లుడిగినట్టు అలాగే నిలుచుండిపోయాను.

*

# వార ఫలాలు

**11-6-86 నుండి 17-6-86 వరకు**

## మేషం

ఇటీవలి కాలంలో మీరు మీ శక్తిని అంతా వినియోగించి సాధించ ప్రయత్నించిన కార్యాలు ఈ వారం నుంచి నులభంగా నిర్వహించగలుగుతారు. ఏలాటి బాధ్యతలనైనా నిర్వహించడం బాధాకరంగా అనిపించదు. సులువుగా చేయగలుగుతారు.

## వృషభం

మీకు నర్వతోముఖంగా అనుకూలప్రదంగా ఉండేకాలం. మీరు నిర్వహించవలసిన బాధ్యతలు ఈ కాలంలో పూర్తి చేసి తృప్తి, సౌఖ్యాలను అనుభవించగలుగుతారు. మీ కుటుంబ నమన్యల పరిష్కారానికి ప్రయత్నం చేయండి.

## మిథునం

మీరు పెద్ద కుటుంబంలో జన్మించి ఉంటే మీ సోదరీ సోదరుల విషయంలో మార్పులు గమనిస్తారు. మీరు వారి వద్దకు వెళ్ళి ఉండటం లేదా వారిని మీ వద్దకు తీసుకొని రావడం జరుగుతాయి. వారి జీవితమార్గం సుఖశాంతులతో ఉండటం మీకు తృప్తికరం.

## కర్కాటకం

స్థిరాస్తి నంబంధ విషయాలను పరిష్కరించుకోదలచిన వారు ఈ వారంలో మీకు ప్రాప్తించే గ్రహానుకూలతను సద్వినియోగం చేసుకోవాలి. స్థిరాస్తి క్రయ విక్రయాదులకు ఈ వారం అనుకూలప్రదం. లాభదాయకం. పుష్యమి నక్షత్ర జాతకులకు నర్వానుకూలప్రదం.

## సింహం

కొంతకాలం దాకా కొన్ని విషయాలలో మీరు ఎందుకు శ్రద్ధ వహిస్తున్నారో గ్రాహ్యం గాని పరిస్థితి ఉంటుంది. మీకు ఈ వ్యవహారాలలో అభిమానం కలిగించి ప్రవేశపెట్టినవారు తప్పుకొంటారు. ఏం చెయ్యాలనే ఆలోచనలో ఉంటారు. త్వరపడకూడదు.

## కన్య

అవివాహితులకు ఇంకా మూ డువారాల అనంతరం అనుకూల కాలం గాన అందుకు తగిన ప్రయత్నాలు ఈ వారం నుండి కొనసాగనున్నవి. వర్తమాన కాలంలో మీకు అండగా ఉన్న మిత్రులు మీకు ఎంతైనా సాయం చేస్తారు. వారి నలహాలను పాటించి చేసే శుభకార్యాలు అనుకూలంగా ఉండగలవు.

## తుల

మీరు ప్రజాభిమానానికి ఎంత సన్నిహితులో ఇంతవరకూ మీకే తెలియదు. ఈ వారంలో మీ పై వారికి గల ఆదరాభిమానాలు వ్యక్తం కావటం వల్ల మీకే ఆశ్చర్యం కలుగుతుంది. మీ మిత్రులు ప్రతి విషయంలోను మీ ప్రమేయం ఉండాలన్న కోరికతో ఉన్నారు.

## వృశ్చికం

మీకు తెలియకుండా మీ విషయంలో సుహృద్భావంతో ఎందరు శ్రమించి కార్య సాధనకు దోహదం గావించారో గ్రహించగలుగుతారు. ఈ వారం నుంచి లాభదాయకంగా ఉంటుంది.

## ధనుస్సు

ఈ వారంలో మీ వాతావరణం అనుకూలంగా లేనందున అధికమైన ఒత్తిడులు అనుభవించవలసి రావచ్చు. ఈ కాలంలో మీ నిర్ణయాలు కూడా సరియైనవిగా ఉండవు. ఇది గ్రహించి మీరు కలతచెందకుండా ఏకాగ్రత గలిగి వ్యవహరిస్తే ప్రమాదాల నుండి తప్పుకొనే అవకాశం లభిస్తుంది.

## మకరం

మీకు సరియైన వేళకు భోజనం, తగు నిద్ర లేనందున అనారోగ్యానికి గురైనారు. ఇక నుంచి అయినా వేళకు భోజనం, విశ్రాంతి లభించే రీతిగా మీ కార్యాలను సరిచేసుకొని ఆరోగ్య విషయంలో జాగ్రత్త వహించాలి.

## కుంభం

ఈ వారంలో మీరు సంకల్పించిన మార్పులు జరపండి. ఇప్పుడు మీరు కోరిన రీతిగా కార్యకలాపాలు కొనసాగడం శ్రమకరంగాదు. బంధుమిత్రుల సాయం కూడా లభిస్తుంది. మీపై గౌరవభావం గల వారు ఎక్కువగా ఉన్నారు.

## మీనం

భాగస్వామ్య వ్యాపారం లాభదాయకంగా ఉంటుంది. మీరు ఒక్కరే నిర్వహించవలసిన కార్యాలు శ్రమకరంగా ఉంటాయి. ఇతరుల సాయం అపేక్షించకుండా శ్రమ పడటం ఉచితం గాదు. మీకు సాయం చేయగల సమర్థులున్నారని గ్రహించి సులభంగా వాటిని పరిసమాప్తి చేయండి.

-దివాకరుని వెంకట సుబ్బారావు